సాక్షి విశాఖపట్నం

సోమవారం । 19 । ఆగస్టు । 2024



ప్రాణాలు పోసే వైద్యులకే రక్షణ లేదా? 8లో



నగరంలో వర్షం.. సేదతీరిన జనం 8లో



ప్లూటో.. వెరీ వెరీ స్పెషల్ 8లో

న్యూస్‌రీల్

హైకోర్టు న్యాయమూర్తితో మర్యాదపూర్వక భేటీ



హైకోర్టు న్యాయమూర్తి రవినాథ్‌కు పుష్పగుచ్ఛం అందజేస్తున్న కలెక్టర్ హరేందిర ప్రసాద్, సీపీ బాగ్చీ

మహారాణిపేట: జిల్లా పర్యటనలో భాగంగా ఆదివారం విశాఖ విచ్చేసిన రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తి రవినాథ్ తిల్హారితో కలెక్టర్ ఎం.ఎన్. హరేందిర ప్రసాద్, పోలీస్ కమిషనర్ శంఖ బ్రత బాగ్చి మర్యాదపూర్వకంగా భేటీ అయ్యారు. స్థానిక గ్రీన్ పార్క్ హోటల్‌లో ఆయన్ని కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. అంతకు ముందు జిల్లా ప్రధాన న్యాయమూర్తి అలపాటి గిరిధర్ హైకోర్టు న్యాయమూర్తిని మర్యాదపూర్వకంగా కలిశారు.

కనకమహాలక్ష్మి సేవలో హైకోర్టు న్యాయమూర్తి



అమ్మవారికి పూజలు నిర్వహిస్తున్న హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ జ్యోతిర్మయి

డాబాగార్డెన్స్: కనకమహాలక్ష్మి అమ్మవారిని ఆదివారం హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ పీవీ జ్యోతిర్మయి కుటుంబసమేతంగా దర్శించుకున్నారు. ఈ సందర్భంగా అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. అర్చకుల వేద ఆశీర్వచనం అనంతరం ఆమెకు ఏఈవో రాంబాబు అమ్మవారి ప్రసాదం అందజేశారు.

పటిక బెల్లంతో హోం మంత్రి తులాభారం



అప్పన్నకు పటిక బెల్లం సమర్పిస్తున్న హోం శాఖ మంత్రి అనిత

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీ నృసింహస్వామిని ఆదివారం రాష్ట్ర హోం శాఖ మంత్రి వంగలపూడి అనిత కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. మెట్ల మార్గంలో సింహగిరికి చేరుకుని, తులాభారం కింద స్వామికి పటిక బెల్లం సమర్పించారు. ఆలయంలోని కప్ప స్తంభాన్ని ఆలింగనం చేసుకుని, బేడా మండపంలో ప్రదక్షిణ చేశారు. అంతరాలయంలో ఆమె పేరుతో అర్చకులు ప్రత్యేక పూజలు నిర్వహించి, వేద ఆశీర్వచనం అందించారు. ఆలయ సంప్రదాయం ప్రకారం స్వామి జ్ఞాపిక, ప్రసాదాన్ని ఈవో శ్రీనివాసమూర్తి ఆమెకు అందజేశారు.

డీఎస్ఎన్ఎల్‌యూలో నేడు సుప్రీంకోర్టు జడ్జి పర్యటన

ఇంటలెక్చువల్ ప్రాపర్టీస్ చైర్ ప్రారంభం



మాట్లాడుతున్న డీఎస్ఎన్ఎల్‌యూ ఉపకులపతి సూర్యప్రకాశరావు

సబ్బవరం: దామోదరం సంజీవయ్య జాతీయ న్యాయ విశ్వ విద్యాలయాన్ని(డీఎస్ఎన్ఎల్‌యూ) సోమవారం సుప్రీంకోర్టు న్యాయమూర్తి, విశ్వవిద్యాలయ పూర్వ కులపతి జస్టిస్ జె.కె.మహేశ్వరి సందర్శించనున్నారు. వర్సిటీలోని కాన్ఫరెన్స్ హాల్‌లో ఆదివారం జరిగిన విలేకరుల సమావేశంలో వీసీ ఆచార్య డి.సూర్యప్రకాశరావు ఈ వివరాలు వెల్లడించారు. విశ్వవిద్యాలయంలో ఏర్పాటు చేసిన ఇంటలెక్చువల్ ప్రాపర్టీస్ చైర్‌ను మధ్యాహ్నం 2.30 గంటలకు జస్టిస్ మహేశ్వరి చేతులమీదుగా ప్రారంభించనున్నట్లు తెలిపారు. అనంతరం న్యాయ విద్యార్థులనుద్దేశించి 'న్యాయవాద వృత్తి–న్యాయ విశ్వవిద్యాలయాలు, కళాశాలల పాత్ర' అనే అంశంపై ఆయన ప్రసంగిస్తారన్నారు. విశ్వవిద్యాలయాలకు ఇచ్చే ర్యాంకుల్లో ప్రస్తుతం వర్సిటీకి 39వ ర్యాంకు వచ్చిందని, ఈ ర్యాంకును మరింత మెరుగుపరచడానికి కృషి చేస్తున్నట్లు వివరించారు. వర్సిటీలో త్వరలో మూడేళ్ల ఎల్ఎల్‌బీ కోర్సును ప్రారంభిస్తామన్నారు. ఈ కోర్సుకు సంబంధించిన ప్రవేశాలకు జాతీయస్థాయిలో ఈ నెల 24న ప్రవేశ పరీక్ష నిర్వహించనున్నట్లు తెలిపారు. సమావేశంలో వర్సిటీ రిజిస్ట్రార్ ఆచార్య నందిని, ఎగ్జామినేషన్ డీన్ బి.సోమ, పీఆర్వో విశ్వచంద్ర తదితరులు పాల్గొన్నారు.

అయితే గోదావరి లేదంటే గరీబ్‌రథ్!

ఒడిశాకు తరలించేందుకు విశ్వప్రయత్నాలు



ఇప్పటికే ప్రశాంతి ఎక్స్‌ప్రెస్, విశాఖ ఎక్స్‌ప్రెస్‌ను భువనేశ్వర్‌కు తరలించుకుపోయిన ఈస్ట్‌కోస్ట్ రైల్వే.. ఇప్పుడు మరో రెండు రైళ్లపై దృష్టిసారించింది. రద్దీ లేదన్న అబద్ధపు ప్రచారంతో విశాఖ నుంచి బయలుదేరే రైళ్లను తమ ఖాతాలోకి వేసుకునేందుకు కుయుక్తులు పన్నుతోంది. అయితే గోదావరి.. లేదంటే గరీబ్‌రథ్‌ను ఎలాగైనా తమ ప్రాంతం నుంచి నడిచేలా ఒడిశా ప్రయాణికుల సంఘాలతో కలిసి పావులు కదుపుతోంది. ఆ రాష్ట్రానికి చెందిన కేంద్ర గిరిజన శాఖ మంత్రితో కలిసి రైల్వే మంత్రిపై ఒత్తిడి తీసుకొస్తోంది. ఈ రైళ్లు గుణుపూర్ నుంచి బయలుదేరేలా చర్యలు తీసుకోవాలంటూ ఒడిశా ప్రయాణికుల సంఘాలు వినతులు కూడా అందించాయి.

- ఆ రాష్ట్రానికి చెందిన కేంద్ర గిరిజన శాఖ మంత్రితో కలిసి మంతనాలు
- గుణుపూర్ నుంచి బయలుదేరేలా కేంద్ర రైల్వే మంత్రికి వినతులు
- ఇప్పటికే ప్రశాంతి, విశాఖ ఎక్స్‌ప్రెస్‌లను పట్టుకుపోయిన ఈస్ట్‌కోస్ట్ జోన్
- విశాఖ నగర వాసుల ఆందోళన

రైలు - గోదావరి సూపర్ ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్ (12727/12728)
ప్రయాణం- విశాఖ-సికింద్రాబాద్
ప్రారంభం- 1974 ఫిబ్రవరి

రైలు - గరీబ్‌రథ్ ఎక్స్‌ప్రెస్ (12739/12740)
ప్రయాణం- విశాఖ-సికింద్రాబాద్
ప్రారంభం- 2008 అక్టోబరు 25న

సాక్షి, విశాఖపట్నం: విశాఖ కేంద్రంగా రైల్వే జోన్ ఏర్పాటు చేస్తున్నామంటూ కేంద్ర ప్రభుత్వం ప్రకటన చేసినప్పటి నుంచి వాల్తేరు డివిజన్ నిర్వీర్యం చేసేందుకు ఈస్ట్‌కోస్ట్ రైల్వే జోన్ అధికారులు విశ్వప్రయత్నాలు చేస్తున్నారు. విశాఖ రైల్వే స్టేషన్ ఆదాయాన్ని పూర్తిగా తగ్గించేసే విధంగా జోనల్ అధికారులు ఒక్కో అస్త్రాన్ని సంధిస్తున్నారు. గతంలో ప్రశాంతి, విశాఖ ఎక్స్‌ప్రెస్‌లను భువనేశ్వర్ పట్టుకుపోయారు. పాసింజర్ రైళ్లను పొడిగించుకున్నారు. ఇప్పుడు వారి దృష్టి 50 ఏళ్ల చరిత్ర ఉన్న గోదావరిపై పడింది.

కుటిలయత్నాలు ఆరంభం

విశాఖపట్నం–హైదరాబాద్ మధ్య అత్యధిక డిమాండ్ ఉన్న రైలు గోదావరి ఎక్స్‌ప్రెస్(12727/12728). ఎన్ని రైళ్లు వచ్చినా ఈ ఎక్స్‌ప్రెస్‌కు ఉన్న డిమాండ్ ఏమాత్రం తగ్గలేదు. 1974 ఫిబ్రవరిలో ఈ సూపర్ ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్ సర్వీసు మొదలైంది. అప్పటి నుంచి ప్రతి రోజూ 100 శాతానికి పైగా ఆక్యుపెన్సీతో నడుస్తోంది. ఈ ఏడాది 50 ఏళ్లు కూడా పూర్తి చేసుకుంది. ఈ పరిస్థితుల్లో గోదావరిని దారి మళ్లించేందుకు కుటిలయత్నాలు మొదలయ్యాయి.



విశాఖలో రద్దీగా ఉన్న గోదావరి ఎక్స్‌ప్రెస్

అబద్ధపు నివేదికలతో..

ఇప్పటికే విశాఖ ఎక్స్‌ప్రెస్, ప్రశాంతి ఎక్స్‌ప్రెస్‌లను విశాఖ నుంచి భువనేశ్వర్‌కు పట్టుకుపోయారు. విశాఖ నుంచి బయలుదేరే ఈ రైళ్లన్నీ నిరంతరం ఫుల్‌గానే వెళ్లేవి. కానీ ఆక్యుపెన్సీ తక్కువగా ఉంటున్నాయంటూ అబద్ధపు నివేదికలతో ఆ రైళ్లను విశాఖ నుంచి భువనేశ్వర్ వరకు పొడిగించుకున్నారు. ఇప్పుడు గోదావరి ఎక్స్‌ప్రెస్‌పై వారి కన్ను పడింది. ఎనిమిదేళ్ల క్రితం కూడా గోదావరిని భువనేశ్వర్ నుంచి బయలుదేరాలా ఒడిశా అధికారులు తెరపైకి ప్రతిపాదనలు తీసుకొచ్చారు. అప్పట్లో ప్రజలు, ఇక్కడి అధికారుల నుంచి తీవ్ర వ్యతిరేకత వ్యక్తమైంది.

గుణుపూర్ నుంచి అంట?

భువనేశ్వర్ నుంచి ప్రారంభించాలన్న ఆలోచనపై వ్యతిరేకత రావడంతో ఇప్పుడు గుణుపూర్ ప్రాంతాన్ని ఒడిశా వాసులు తెరపైకి తీసుకొస్తున్నారు. గోదావరి ఎక్స్‌ప్రెస్‌ను గుణుపూర్ నుంచి వైజాగ్ మీదుగా హైదరాబాద్ నడిపేలా షెడ్యూల్ ఫిక్స్ చేయాలంటూ గుణుపూర్ రైల్వే ప్రయాణికుల సంఘంతో పాటు ఆంధ్ర ఒడిశా రైల్వే ప్రాక్టీషనర్స్ అసోసియేషన్ ప్రతినిధులు డిమాండ్ చేస్తున్నారు.

'పట్టు'వదలడం లేదు

గోదావరి ఎక్స్‌ప్రెస్ తరలించేందుకు ఈస్ట్‌కోస్ట్ జోన్ అధికారులు ఒత్తిడి తీసుకొస్తున్న మాట వాస్తవమేనని కొందరు వాల్తేరు డివిజన్ అధికారులు చెబుతున్నారు. గతంలో వచ్చిన వ్యతిరేకత గురించి చెప్పినా ఏదో విధంగా పొడిగింపునకు ప్రయత్నిస్తామని పట్టుబడుతున్నారని సీనియర్ అధికారి వివరించారు. గోదావరి లేదంటే గరీబ్‌రథ్‌ను తీసుకెళ్లేందుకు విశ్వ ప్రయత్నాలు చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. తక్కువ ధరతో ప్రయాణికులను చేరవేస్తున్న గరీబ్‌రథ్ రైలుపై ఇప్పటికే రైల్వే బోర్డు అసంతృప్తిగా ఉందనీ.. ఈ నేపథ్యంలో దాన్ని పొడిగించేందుకు రైల్వే ఆసక్తిగా లేదని చెబుతున్నారు. ఇక మిగిలిన గోదావరి ఎక్స్‌ప్రెస్‌పైనే ఒత్తిడి ఉందంటున్నారు. దీనిపై ఎంపీలు, స్థానిక ప్రజాప్రతినిధులు జోక్యం చేసుకోకపోతే గోదావరి కూడా విశాఖ నుంచి తరలిపోయే ప్రమాదం ఉందని వాల్తేరు అధికారులు హెచ్చరిస్తున్నారు.

దీనిపై ఇప్పటికే ఆ ప్రాంతానికి చెందిన కేంద్ర గిరిజన వ్యవహారాల శాఖ మంత్రి జువల్ ఓరమ్‌తో పాటు ఒడిశా నుంచి ప్రాతినిధ్యం వహిస్తున్న రైల్వే మంత్రి అశ్వినీ వైష్ణవ్‌ని కలిసి గోదావరి ఎక్స్‌ప్రెస్ పొడిగింపుతో పాటు అనేక అంశాలతో కూడిన వినతి పత్రాల్ని అందించారు. గోదావరి ఎక్స్‌ప్రెస్ సాధ్యం కాకపోతే విశాఖ–సికింద్రాబాద్ గరీబ్‌రథ్ ఎక్స్‌ప్రెస్ (12739/12740) అయినా గుణుపూర్ నుంచి మొదలయ్యేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు.

నేటి నుంచి ఉద్యోగుల బదిలీలు

- 14 ప్రభుత్వ శాఖల్లో ఉద్యోగులకు స్థానచలనం
- ఐదేళ్లు ఒకే దగ్గర పనిచేసే వారి జాబితా సిద్ధం
- గిరిజన ప్రాంతాల్లో రెండేళ్లకు పైగా పనిచేసే వారికి ప్రాధాన్యం

మహారాణిపేట: జిల్లాలో 14 ప్రభుత్వ శాఖల కార్యాలయాల్లో ఉద్యోగుల సాధారణ బదిలీలకు సోమవారం శ్రీకారం చుట్టనున్నారు. బదిలీలపై నిషేధాన్ని ప్రభుత్వం తాత్కాలికంగా తొలగించడంతో అధికార యంత్రాంగం కసరత్తు చేస్తోంది. అలాగే ఒకే సీటులో ఐదేళ్లపాటు పనిచేసిన వారికి స్థానచలనం కల్పించనున్నారు. మన్యం ప్రాంతాల్లో రెండేళ్లకు పైగా పనిచేసే వారికి బదిలీల్లో ప్రాధాన్యం ఇవ్వనున్నారు. అలాగే రెవెన్యూశాఖలో ఉమ్మడి జిల్లాల వారీగా బదిలీలు చేయనున్నారు. ఇప్పటికే ఈ వివరాలు జాబితా ఉన్నతాధికారుల వద్ద సిద్ధంగా ఉంది. ఈనెల 31 నాటికి మొత్తం బదిలీల ప్రక్రియను పూర్తి చేయనున్నారు. మే,జూన్ నెలల్లో బదిలీల ప్రక్రియ పూర్తి చేసేవారు.. సార్వత్రిక ఎన్నికల కారణంగా బదిలీలను నిలిపివేశారు. అయితే అన్ని శాఖలకు కాకుండా కేవలం 14 శాఖల ఉద్యోగులకు మాత్రమే బదిలీల ప్రక్రియ నిర్వహించాలని ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. ఈ ఏడాది జూలై 31 నాటికి ఒకే కార్యాలయంలో ఐదేళ్ల సర్వీసు పూర్తి చేసిన వారిని బదిలీ చేయనున్నారు. అన్ని క్యాడర్లు, పోస్టుల్లో చేసిన సర్వీసును పరిగణనలోకి తీసుకుని బదిలీల ప్రక్రియ నిర్వహించనున్నారు. గిరిజన ప్రాంతాల్లో రెండేళ్లకు మించి పని చేసినవారికి, 40 శాతానికి మించి వైకల్యం ఉన్న ఉద్యోగులు ధ్రువీకరణ పత్రం సమర్పిస్తే బదిలీల్లో ప్రాధాన్యం ఇస్తారు.

పైరవీలు జోరు : ఐదేళ్లు ఒకే సీటులో ఉన్న వారి వివరాల జాబితా అధికారుల వద్ద ఉంది. తమ కుర్చీ కాపాడుకునేందుకు ఉద్యోగులు పైరవీలకు తెరతీశారు. ఎమ్మెల్యేల చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారు. ఓ మంత్రి వద్ద పనిచేయడానికి జెడ్పీ సీఈవో ప్రయత్నాలు చేస్తున్నట్లు సమాచారం. డ్వామా పీడీ, పర్యాటక శాఖ, పంచాయతీరాజ్, గనులు, బీసీ, ఎస్సీ, సాంఘిక సంక్షేమ శాఖ, జీవీఎంసీ శాఖల్లో పోస్టులు కోసం భారీగా పైరవీలు చేస్తున్నారు. అలాగే రెవెన్యూ శాఖలో తహసీల్దార్ల పోస్టుల కోసం భారీగా పైరవీలు జరుగుతున్నాయి.

విశాఖ రేంజ్‌లో పది మంది ఏసీపీల బదిలీ

అల్లిపురం: విశాఖ రేంజ్‌లో పది మంది ఏసీపీలకు బదిలీ చేస్తూ రాష్ట్ర డీజీపీ ద్వారకాతిరుమలరావు ఆదివారం ఉత్తర్వులు జారీ చేశారు. పోలీస్ ఎస్టాబ్లిస్‌మెంట్ బోర్డు సూచనల మేరకు బదిలీలు చేపట్టారు.

సంఖ్య	ఏసీపీ పేరు	ప్రస్తుతం పనిచేస్తున్న స్థలం	బదిలీ అయిన స్థలం
1.	సీహెచ్.వివేకానంద	మహిళా పీఎస్, విశాఖపట్నం	ఎస్డీపీఓ, శ్రీకాకుళం
2.	జి.సునీల్	నార్త్ ఏసీపీ, విశాఖపట్నం	పోలీస్ హెడ్ క్వార్టర్స్‌లో రిపోర్టింగ్
3.	ఎ.త్రినాథరావు	శ్రీకాకుళం, ఎస్బీ, డీఎస్పీ	డీఎస్ఆర్‌పీ, విశాఖపట్నం
4.	జి.మోహనరావు	డీఎస్ఆర్‌పీ, విశాఖపట్నం	కాకినాడ, ఏపీఎస్పీ 3వ బెటాలియన్
5.	ఎం.శ్రావణి	డీఎస్పీ, ఇంటిలిజెన్స్	ఎస్డీపీఓ, అనకాపల్లి
6.	ఎస్.అప్పలరాజు	ఎస్డీపీఓ, అనకాపల్లి	పోలీస్ హెడ్ క్వార్టర్స్‌లో రిపోర్టింగ్
7.	సీహెచ్.పెంటారావు	సీఐడీ, డీఎస్పీ	మహిళా పీఎస్, విశాఖపట్నం
8.	కె.ప్రభాకర్	డీఎస్పీ, డీటీసీ, ఏలూరు	ఏసీపీ, సిటీ స్పెషల్ బ్రాంచ్, విశాఖపట్నం
9.	ఎం.శ్రీనివాసరావు	సిటీ స్పెషల్ బ్రాంచ్, ఏసీపీ, విశాఖపట్నం అటాచ్డ్ డీటీసీ అనకాపల్లి	డీఎస్పీ, డీటీసీ అనకాపల్లి
10.	జి.మోసెస్ పాల్	ఏసీపీ, హార్బర్	పోలీస్ హెడ్ క్వార్టర్స్‌లో రిపోర్టింగ్

అనుబంధాలకు ప్రతీక రక్షాబంధన్





ఈ ప్రపంచంలోని బంధాలన్నింటిలోనూ సోదర, సోదరీ బంధం ప్రత్యేకమైనది. అన్నా చెల్లెళ్లు, అక్కా తమ్ముళ్ల బంధం వెలకట్టలేనిది. సోదరుడు సుఖంగా ఉండాలని సోదరీమణి రక్ష కడుతుంది. సోదరికి రక్షగా ఉంటానని సోదరుడు భరోసా ఇస్తాడు. రక్షాబంధన్ వేళ రాఖీల కొనుగోళ్లతో మార్కెట్లు సందడిగా మారాయి. ఏ షాపులో చూసినా వివిధ ఆకృతులు, డిజైన్లలో రాఖీలు దర్శనమిచ్చాయి.

– ఫొటోలు: సాక్షి ఫొటోగ్రాఫర్, విశాఖపట్నం

రెండు ఏటీఎం కేంద్రాల్లో భారీ చోరీ



ధ్వంసమైన తగరపువలస దరి ఏటీఎం కేంద్రం

జిల్లాలో రెండు ఎస్‌బీఐ ఏటీఎం కేంద్రాల్లో భారీ నగదు చోరీ జరిగింది. శనివారం తెల్లవారుజామున గుర్తు తెలియని వ్యక్తులు ఏటీఎంలను విరగ్గొట్టి నగదు అపహరించుకుపోయారు. తగరపువలస అవంతి ఇంజనీరింగ్ కళాశాల ఎదురుగా ఉన్న ఏటీఎం కేంద్రంలో రూ.14.49 లక్షలు, పెందుర్తి లక్ష్మీకాంత్ థియేటర్‌కు ఆనుకుని ఉన్న ఏటీఎం కేంద్రంలో రూ.19.70 లక్షలు ఎత్తుకెళ్లారు. ఇతర రాష్ట్రాలకు చెందిన వారే ఈ చోరీకి పాల్పడినట్లు తెలుస్తోంది. 5లో

నేడు వినతుల స్వీకరణ

మహారాణిపేట: కలెక్టర్ కార్యాలయంలో సోమవారం ప్రజా ఫిర్యాదుల పరిష్కార(పీజీఆర్ఎస్) కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ ఎం.ఎన్.హరేందిర ప్రసాద్ తెలిపారు. స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఫలితాల ప్రకటించడంతో సోమవారం నుంచి యథావిధిగా ప్రజల నుంచి వినతులు స్వీకరిస్తామన్నారు.

జీవీఎంసీలో..

డాబాగార్డెన్స్: జీవీఎంసీ ప్రధాన కార్యాలయంతో పాటు అన్ని జోనల్ కార్యాలయాల్లో సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదిక నిర్వహిస్తున్నట్లు మేయర్ గొలగాని హరి వెంకటకుమారి, జీవీఎంసీ కమిషనర్ పి.సంపత్‌కుమార్ తెలిపారు. ఉదయం 11 నుంచి మధ్యాహ్నం ఒంటి వరకు ప్రజల నుంచి వినతులు స్వీకరిస్తామన్నారు.

ఫైర్ 'సేఫ్టీ'పై పట్టింపేదీ?

- నగరంలో ఆందోళన కలిగిస్తున్న వరుస ప్రమాదాలు
- ఇటీవల రెండు ఆస్పత్రులు, డైనో పార్క్‌లో అగ్నికీలలు
- కనీసం తనిఖీలు చేయని జీవీఎంసీ అగ్నిమాపక అధికారులు



డైనో పార్కులో జరిగిన అగ్ని ప్రమాదంలో మంటలు అదుపు చేస్తున్న సిబ్బంది(ఫైల్)

సాక్షి, విశాఖపట్నం : నగరంలోని అన్ని వాణిజ్య సముదాయాలు, థియేటర్లు, హాస్పిటల్స్, గేమింగ్ జోన్స్, రెస్టారెంట్స్, హోటల్స్‌లో ఫైర్ సేఫ్టీ భయం పుట్టిస్తోంది. ఇటీవల రెండు ఆస్పత్రుల్లోను, బీచ్ రోడ్డులోని సిల్వర్‌స్పూన్ రెస్టారెంట్‌కు చెందిన డైనో పార్క్‌లో జరిగిన అగ్ని ప్రమాదాలు ఆందోళన కలిగిస్తున్నాయి. జీవీఎంసీ, అగ్నిమాపక, రెవెన్యూ శాఖల అధికారులు తూతూమంత్రంగా తనిఖీలు నిర్వహిస్తూ చేతులు దులిపేసుకోవడం వల్లే ఈ పరిస్థితి దాపురించిందని ప్రజలు దుమ్మెత్తిపోస్తున్నారు.

ఎక్కడా కనిపించని సేఫ్టీ

నగరంలో 38 వేలకు పైగా కమర్షియల్ ఎస్టాబ్లిష్‌మెంట్స్ ఉన్నాయి. వీటిలో చిన్న చిన్న షాపులు మినహాయించి.. దాదాపు 15 వేల వరకూ ఫైర్ సేఫ్టీ మెథడ్స్ పాటించాల్సిన కమర్షియల్ ఎస్టాబ్లిష్‌మెంట్స్ ఉన్నాయి. వీటిలో అగ్నిప్రమాద నివారణకు సంబంధించి తీసుకోవాల్సిన చర్యలు కనిపించడం లేదు. అగ్నిమాపక పరికరాలు కొన్నిచోట్ల ఉన్నా అవి సక్రమంగా పనిచేయడం లేదు. వాటర్ ట్యాంకులు, పైప్‌లైన్లు శిథిలావస్థకు చేరుకున్నవీ ఉన్నాయి. డైనో పార్క్‌లాంటి గేమింగ్ పార్కులు పూర్తిగా నిబంధనల్ని అతిక్రమిస్తున్నాయి. సరైన పర్మిషన్లు లేకుండానే వీటిని కొనసాగిస్తున్నారు. ఏదైనా ప్రమాదం జరిగితే స్ప్రే ద్వారా కార్బన్‌డయాక్సైడ్ వదులుతూ అక్కడ ఉన్న వారిని బయటకు పంపించే విధంగా ఏర్పాటు చెయ్యాలి. అలాంటి పరికరాలు దాదాపు 65 శాతం వాణిజ్య సముదాయాల్లో కనిపించడం లేదని తెలుస్తోంది.

ప్రమాదం జరిగినప్పుడే పరుగులు

నగర పరిధిలో ఉన్న థియేటర్లన్నింటికీ ఫైర్ సేఫ్టీ అనుమతుల్ని ప్రాంతీయ అగ్నిమాపక శాఖ అధికారులే ఇవ్వాల్సి ఉంది. మూడేళ్లకోసారి వాటిని రెన్యువల్ చేయించుకోవాల్సి ఉంటుంది. వీటిని సంబంధిత అధికారులు తప్పనిసరిగా పరిశీలించాల్సి ఉంటుంది. అక్కడ అగ్నిమాపక వ్యవస్థ పనితీరు ఎలా ఉంది.? సిబ్బందికి అవగాహన ఏమాత్రం ఉంది.? అనే విషయాల్ని పరిశీలించాలి. ఆ తర్వాతే ఎన్‌వోసీ జారీ చేయాల్సి ఉంటుంది. అయితే అలసత్వంతో పాటు మామూళ్ల మత్తుతో కాలు కదపకుండానే ఎన్‌వోసీలు జారీ చేసేస్తున్నారు. ఎప్పుడైనా.. డైనోపార్క్, సెవెన్‌హిల్స్ హాస్పిటల్, మెడికవర్ హాస్పిటల్ తరహా ప్రమాదాలు జరిగినప్పుడు మాత్రం.. అధికారులకు అనుమతులు, నిబంధనలు గుర్తుకొస్తుంటాయి. ఆ రెండు రోజుల పాటు హడావుడి చేసేస్తూ అన్ని చోట్లా తనిఖీలు నిర్వహించేస్తారు. ఆ తర్వాత మరో ప్రమాదం జరిగే వరకూ నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుంటారనే విమర్శలు వినిపిస్తూనే ఉన్నాయి.

చూసీచూడనట్లుగా జోన్-3 రెవెన్యూ అధికారులు

ప్రతి రోజూ జోన్-3 జీవీఎంసీ అధికారులు, సిబ్బంది బీచ్‌రోడ్డులో వెళ్తుంటారు. కానీ.. సిల్వర్ స్పూన్ రెస్టారెంట్ అక్రమాలు మాత్రం తమకేమీ కనిపించనట్లుగా వ్యవహరిస్తున్నారు. ఈ రెస్టారెంట్ యాజమాన్యంతో గతంలో జోన్-3 రెవెన్యూ అధికారులు సమావేశమైనట్లు తెలుస్తోంది. ఆక్రమిత భాగాన్ని చదును చేసి జీవీఎంసీకి రూపాయి లీజు కట్టకుండా పార్కింగ్‌కి వినియోగించుకోవచ్చని ఉచిత సలహాలు కూడా ఇచ్చేశారు. ఫలితంగా భారీగానే రెవెన్యూ సిబ్బందికి డబ్బులు ముట్టినట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఈ విషయంపై ఉన్నతాధికారులకు కూడా తప్పుడు సమాచారం అందించినట్లు తెలుస్తోంది. ఫైర్ నిబంధనలు పాటించకపోవడం వల్లే ఈ పార్క్‌లో అగ్నిప్రమాదం సంభవించిందనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.

సిల్వర్ స్పూన్ పేరుతో అడ్డగోలు నిర్మాణాలు

బీచ్‌రోడ్డులోని సిల్వర్‌స్పూన్ రెస్టారెంట్ గతంలో పలు వివాదాలకు కేంద్రంగా ఉండేది. జీవీఎంసీ దగ్గర లీజు తీసుకొని సబ్‌లీజుకు ఇచ్చేసినా రెవెన్యూ సిబ్బంది పట్టించుకోలేదు. ఫలితంగా గ్రేటర్‌కు రావాల్సిన రూ.కోట్ల ఆదాయం జీవీఎంసీ రెవెన్యూ విభాగం జేబుల్లోకి వెళ్లిపోయింది. ఆ తర్వాత కూడా అదే తీరు కనబరిచారు. 2018లో సిల్వర్ స్పూన్ రెస్టారెంట్‌ని సీజ్ చేసిన అధికారులు కోర్టు తీర్పుతో మరోసారి 2022లో మళ్లీ వారి చేతుల్లోనే స్థలాన్ని పెట్టారు. ఇక్కడే జీవీఎంసీ జోన్-3 రెవెన్యూ అధికారులు చక్రం తిప్పారు. 419 గజాలు(3,778 చ.అడుగుల) మాత్రమే రెస్టారెంట్‌కు లీజుకు ఇచ్చారు. ఈ స్థలంలో మాత్రమే రెస్టారెంట్ నిర్వహించాలనీ.. తాత్కాలిక నిర్మాణాలు మాత్రమే చేపట్టాలని షరతు విధించారు. మొత్తం ఏడాదికి రూ.19,26,780 లీజు కార్పొరేషన్‌కు కట్టాలని నిబంధనల్లో స్పష్టం చేశారు. అయితే ఇచ్చిన స్థలంతో పాటు పక్కనే జీవీఎంసీకి చెందిన 1600 చ.అడుగుల స్థలాన్ని కూడా ఆక్రమించేసి పార్కింగ్, ఇతర అవసరాలకు వినియోగించేసుకుంటున్నారు.

డైనోపార్క్‌కు ఎన్‌వోసీ లేదు



నగర పరిధిలోని పలు కమర్షియల్ ఎస్టాబ్లిష్‌మెంట్స్‌కు ఎన్‌వోసీ లేదని మా పరిశీలనలో తేలింది. ప్రస్తుతం జీవీఎంసీ పరిధిలో ఉన్న ప్రతి ఎస్టాబ్లిష్‌మెంట్‌ని తనిఖీ చేయాలని ఫైర్ డిపార్ట్‌మెంట్ అధికారులను ఆదేశించాం. 15 రోజుల్లోగా ఎన్‌వోసీలకు సంబంధించిన నివేదిక సిద్ధం చేయాలని సూచించాం. డైనోపార్క్‌కు ఫైర్ సేఫ్టీ ఎన్‌వోసీ లేదని గుర్తించాం.

– పి.సంపత్‌కుమార్, జీవీఎంసీ కమిషనర్

● చిగురించిన సందేశం



ముద్దాడిన కత్తి గాయం చేసింది. అయినా తెగనరికిన చేతులకు నీడ నిచ్చేందుకు మళ్లీ చిగురించినట్టు ఉందీ వృక్షం. ప్రతి ఒక్కరి జీవితాల్లో కష్టాలు వస్తుంటాయి.. పోతుంటాయి.. కాని కుంగిపోకూడదు. ధైర్యంగా మళ్లీ మొదటి నుంచి జీవితం ప్రారంభించాల్సిందే అంటూ జీవిత పాఠాన్ని బోధిస్తోంది. నాలుగు నెలల క్రితం అడ్డుగా ఉందనో, మరే కారణం చేతనో లలితానగర్ రోడ్డులో ఉన్న చెట్టును నరికేసి, మోడు మాత్రమే ఉంచారు. 'అపజయాలు కలిగిన చోటే గెలుపు పిలుపు వినిపిస్తుంది. ఆకులన్నీ రాలిన చోటే కొత్త చిగురు కనిపిస్తుంది' అన్నట్టు మళ్లీ చిగురించింది.

– సాక్షి ఫొటోగ్రాఫర్, విశాఖపట్నం

నగరంలో వర్షం.. సేదదీరిన జనం



నగరంలో ఒక్కసారిగా వాతావరణం మారిపోయింది. ఆదివారం మధ్యాహ్నం వరకు ఎండ తీవ్రత చూపించింది. సాయంత్రం నుంచి చాలా ప్రాంతాల్లో ఆకాశం మేఘావృతమై భారీ వర్షం కురిసింది. దీంతో వాతావరణం చల్లగా మారిపోయింది. కొన్నిరోజులుగా ఉక్కబోతతో ఉక్కిరిబిక్కిరైన నగరవాసులు సేదతీరారు.

– సాక్షి ఫొటోగ్రాఫర్, విశాఖపట్నం



● మహా నగరానికి పచ్చని హారం



సముద్ర అందాలతో విరాజిల్లుతున్న మహా నగరానికి తూర్పు కనుమలు సహజ సౌందర్యంతో ప్రత్యేక ఆభరణంగా నిలుస్తున్నాయి. నగరం విస్తరిస్తున్న కొద్దీ ఈ కనుమల అందాలు మరింత అలరిస్తున్నాయి. కైలాసగిరిపై నుంచి చూస్తే పర్వత శ్రేణులు ప్రకృతి రమణీయతతో మైమరపిస్తున్నాయి. పచ్చందాల చీర కట్టుకున్న ఈ కనుమలు నగరానికి 'రక్షాబంధనం' కడుతున్నట్లుగా ఉందీ చిత్రం. – ఫొటో: సాక్షి ఫొటోగ్రాఫర్, విశాఖపట్నం

ఫ్లూటో వెరీ వెరీ స్పెషల్



దాగ్ షోలో గెలుచుకున్న ట్రోఫీలతో ఫ్లూటో

అక్కిరెడ్డిపాలెం: చెప్పిన మాట వింటుంది. చెప్పిన పని చేస్తుంది.. తన యజమానికి సహాయకారిగా ఉంటుంది. ఇంట్లో కుటుంబ సభ్యుడిలా మెలుగుతుంది. బయట ఫుడ్ అస్సలు తినదు. ఇంట్లో వండిన ఆహారమే తీసుకుంటుంది. నిత్యం ప్రశాంతంగా ఉంటుంది. అందరిపై ప్రేమానురాగాలు కురిపిస్తుంది..అందుకే ఫ్లూటో అంత స్పెషల్.. ఇంతకీ ఫ్లూటో ఎవరో చెప్పలేదు కదూ.. ఫ్లూటో అందమైన జూలున్న శునకం.. బెంగళూరులో జన్మించింది. అక్కిరెడ్డిపాలెంలో ఉంటున్న దాసరి ఖుషీ కుమార్ ఇంట్లో దర్జాగా జీవిస్తోంది. ఫ్లూటో తన యజమానితో కలిసి 300 మీటర్ల పరిధిలో బుట్టలో పాలబాటిల్ పెట్టుకుని ఖాతాదారుల ఇంటింటికీ వెళ్లి అందజేస్తోంది. ఈ వెరీవెరీ స్పెషల్ ఫ్లూటో గురించి తెలుసుకుందాం.

జీవీఎంసీ 69వ వార్డు రెడ్డి తుంగ్లాంలో నివాసం ఉంటున్న దాసరి అనూరాధ కుమారుడు ఖుషీ కుమార్‌కు కుక్కలంటే ప్రాణం. గోల్డెన్ రిట్రీవర్ జాతికి చెందిన మగ జాతి కుక్క (ఫ్లూటో)ను బెంగళూరులో 45 రోజుల వయసుండగా రూ.25 వేలకు కొనుగోలు చేశాడు. ఇది పెరుగుతున్న క్రమంలో ఖుషీకుమార్ ఫ్లూటోలోని కొన్ని లక్షణాలను గమనించాడు. దీంతో ఓ ట్రైనర్ సాయంతో శిక్షణ ఇప్పించాడు. ఖుషీ కుమార్ పాన్ షాప్ నిర్వహిస్తున్నాడు. పాడిపశువులు ఉండడంతో పాల విక్రయాలు చేస్తున్నాడు. ఈ క్రమంలో యజమానికి ఫ్లూటో సహాయకారిగా ఉంటుంది. బుట్టలో పాల బాటిల్ నోట కరుచుకుని యజమానితో కలిసి ఖాతాదారులకు అందజేస్తోంది. ఖాతాదారుడి ఇంటి ముందు అరిచి పిలుస్తుంది.





బుట్టలో పాలను తీసుకెళ్లి.. వినియోగదారుడికి అందించి నమస్కరిస్తున్న ఫ్లూటో

పాల బుట్టను అందజేసి రెండు కాళ్లు ఎత్తి నమస్కరిస్తుంది. తిరిగి ఖాళీ బుట్టను యజమానికి ఇస్తుంది.

డాగ్స్ షోలో అవార్డులు

గతేడాది జరిగిన డాగ్ షోలో రన్నింగ్‌లో ఫ్లూటో ప్రథమ స్థానం సాధించింది. యజమాని చెప్పిన మాటలను తూ.చ తప్పకుండా అనుసరించడంతో గేమ్‌లో ప్రథమ బహుమతి గెలుచుకుంది. ఈ సమయంలో పోలీస్ కుక్కలకు శిక్షణ ఇచ్చే టీం సభ్యుడు ప్రశంసలు అందుకుంది.

ఏటా పుట్టినరోజు వేడుకలు

ఫ్లూటో వచ్చిన దగ్గర నుంచి ఖుషీ కుమార్, కుమార్తె దివ్యలు ఎంతో ఆనందంగా ఉంటున్నారు. కుటుంబ సభ్యులతో కలిసే ఫ్లూటో భోజనం చేస్తుంది. మధ్యాహ్నం 3 గంటలకు మాత్రం పెడీ గ్రీ పెడతామని యజమాని అనూరాధ తెలిపారు. ప్రస్తుతం ఫ్లూటో వయసు రెండేళ్ల మూడు నెలలు. ఏటా ఫ్లూటో పుట్టినరోజును ఘనంగా నిర్వహిస్తామని.. డాక్టర్ల పర్యవేక్షణ, ఆరోగ్యకరమైన ఆహారం ఇస్తుంటామన్నారు. ఇతరులు ఏం పెట్టినా తిరస్కరిస్తుందని.. ఎవరైనా దాడులు చేసుకుంటున్నా వారిని వారిస్తుందన్నారు.

ఇంట్లో మనుషులుండగానే చోరీలు



వివరాలు వెల్లడిస్తున్న నగర క్రైం డీసీపీ వెంకటరత్నం

ఈ ఘరానా దొంగ తీరే వేరు

- రాత్రి పూట దొంగతనాలు చేస్తున్న పాత నేరస్తుడు అరెస్ట్
- అతనికి సహకరించిన వ్యక్తిని అదుపులోకి తీసుకున్న పోలీసులు
- రూ.7.40 లక్షల విలువైన బంగారు ఆభరణాలు, ఓ బైక్ స్వాధీనం

అల్లిపురం: రాత్రి సమయంలో, ఇంట్లో మనుషులుండగానే చోరీలకు పాల్పడుతున్న బాలబోయిన రమేష్ అలియాస్ విక్రమ్‌తో పాటు కోటా రఘునాథ్‌లను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. వారి నుంచి రూ.7.40 లక్షల విలువైన 77 గ్రాముల బంగారం, బైక్ స్వాధీనం చేసుకున్నారు. నగర పోలీస్ కమిషనరేట్ సమావేశ మందిరంలో ఆదివారం క్రైం డీసీపీ పి.వెంకటరత్నం ఈ కేసు వివరాలు వెల్లడించారు. ఈ ఏడాది జూన్ 26న మురళీనగర్ దరి అయ్యప్పనగర్ ప్రాంతంలో గొట్టిపాటి రఘురాం తన ఇంట్లో నిద్రిస్తున్నారు. ఆ సమయంలో దొంగ ప్రధాన ద్వారం తలుపు గడియను విరగ్గొట్టి ఇంట్లోకి ప్రవేశించాడు. రఘురాం నిద్రిస్తున్న గదిలో కాకుండా పక్క గదిలోకి వెళ్లి.. అక్కడే ఉన్న తాళాలతో బీరువాను తెరిచాడు. అందులో గల సుమారు 25 తులాల బంగారు ఆభరణాలను దొంగలించాడు. ఈ ఘటనపై కంచరపాలెం పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదైంది. దర్యాప్తు ప్రారంభించిన పోలీసులు ఘటనా స్థలంలో దొంగ చేతి వేలి ముద్రలను సేకరించారు. సీపీ డాక్టర్ శంఖబ్రత బాగ్చి ఆదేశాలతో వెస్ట్ సబ్ డివిజన్ క్రైం సీఐ ఎన్.శ్రీనివాసరావు, సీసీఎస్ సిబ్బంది బృందాలుగా ఏర్పడ్డారు. నిందితుడి వేలిముద్రల ఆధారంగా సాంకేతిక పరిజ్ఞానం ఉపయోగించి.. పాత నేరస్తుడైన కృష్ణా జిల్లా ఇబ్రహీంపట్నానికి చెందిన బాలబోయిన రమేష్ అలియాస్ విక్రమ్ ఈ చోరీకి పాల్పడినట్లు గుర్తించారు. అతనికి సహకరించిన మరో నిందితుడు కృష్ణా జిల్లా నందిగామకు చెందిన కోటా రఘునాథ్‌లను అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద నుంచి 77 గ్రాముల బంగారు ఆభరణాలు, బైక్ స్వాధీనం చేసుకున్నారు. ప్రధాన నిందితుడు రమేష్‌ను పట్టుకోవడంలో చాకచక్యంగా వ్యవహరించిన అధికారులతో పాటు సీసీఎస్ ఏఎస్ఐ పి.చంద్రశేఖర్, హెడ్ కానిస్టేబుల్ జీవీఎస్‌కే రెడ్డి, కానిస్టేబుల్ ఎన్.అప్పలరాజు, కె.అగస్త్యన్‌లను సీపీ తరఫున ఆమె అభినందించారు.

రమేష్‌పై 31 కేసులు

ప్రధాన నిందితుడు రమేష్‌పై ఎంవీపీ కాలనీ, కంచరపాలెం, ఆరిలోవ, త్రీటౌన్ పోలీస్ స్టేషన్ల పరిధిలో 11 ఇంటి దొంగతనాల కేసులు నమోదయ్యాయి. గుంటూరు, కృష్ణా, ఒంగోలు, నందిగామ ప్రాంతాల్లో మరో 20 కేసులు నమోదయిన్నట్లు క్రైం డీసీపీ తెలిపారు. కొన్ని కేసుల్లో జైలు శిక్ష కూడా అనుభవించాడు. జైలులో కోటా రఘునాథ్‌తో పరిచయం పెంచుకున్న రమేష్.. జైలు నుంచి విడుదలైన తర్వాత శీలానగర్ దరి గొల్ల జగ్గరాజుపాలెం వద్ద ఓ ఇంటిని అద్దెకు తీసుకున్నాడు. దొంగతనం చేసిన డబ్బుతో ఎంజాయి చేయడం హాబీగా మార్చుకున్నాడు. జూదంతో పాటు తరచూ గోవా వెళ్లేవాడని పోలీసులు గుర్తించారు. రాత్రి పూట ఇంటి ప్రధాన తలుపులు, ముఖ్యంగా కిటికీ పక్కన తలుపులు ఉండే ఇళ్లల్లో దొంగతనాలు చేయడంలో రమేష్ సిద్ధహస్తుడు.

నగర ప్రజలకు డీసీపీ విజ్ఞప్తి

రాత్రి సమయాల్లో బయటకు వెళ్లినప్పుడు ఇంటి ప్రధాన తలుపులకు, ఇనుప గ్రిల్ గేటుకు తాళాలు వేసుకోవాలని డీసీపీ ప్రజలకు సూచించారు. ముఖ్యంగా కిటికీ పక్కన గల తలుపులకు పైన, మధ్య, కింది గెడలను తప్పనిసరిగా వేయడంతో పాటు కిటికీల గెడలు వేసుకోవాలన్నారు. గాలి కోసం ప్రధాన తలుపు వద్ద గల కిటికీలు తెరిచి ఉంచొద్దన్నారు. ఇంటి తాళాలు, బీరువా తాళాలను దుస్తుల కింద, గోడల మీద, షూల్లో పెట్టవదన్నారు. విలువైన వస్తువులు ఉంటే వీలైనంత వరకు లాకర్లలో భద్రపరచుకోవాలని సూచించారు.

పలు రైళ్ల దారి మళ్లింపు

తాటిచెట్లపాలెం: విజయవాడ డివిజన్ పరిధిలో జరగుతున్న పలు భద్రతా పనుల నిమిత్తం పలు రైళ్లు ఆయా తేదీల్లో దారి మళ్లిస్తున్నట్లు వాల్తేర్ డివిజన్ సీనియర్ డీసీఎం సందీప్ తెలిపారు. సెప్టెంబరు 2, 9, 16, 23వ తేదీల్లో ఎర్నాకుళం–పాట్నా (22643) సూపర్ ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్, సెప్టెంబరు 4,6,11,13,18, 20,25,27వ తేదీల్లో ఎస్ఎంవీ బెంగళూరు–గౌహతి (12509) సూపర్ ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్, సెప్టెంబరు 2,4,6,7,9,11, 13, 14,16,18, 20,21, 23,25, 27,29వ తేదీల్లో సిఎస్‌టి ముంబై–భువనేశ్వర్(11019) కోణార్క్ ఎక్స్‌ప్రెస్‌లు వయా విజయవాడ, గుడివాడ, భీమవరం టౌన్, నిడదవోలు మీదుగా నడుస్తాయి.

ఏలూరు, తాడేపల్లిగూడెం మీదుగా కాకుండా..

వచ్చే నెల 2 నుంచి 29వ తేదీ వరకు ధన్‌బాద్–అల్లెప్పి(13351) బొకారో ఎక్స్‌ప్రెస్, వచ్చే నెల 5,12,19,26వ తేదీల్లో టాటానగర్–యశ్వంత్‌పూర్(18111) ఎక్స్‌ప్రెస్, వచ్చే నెల 4,11,18,25వ తేదీల్లో జసిద్ది–తాంబరం (12376) ఎక్స్‌ప్రెస్, వచ్చే నెల 2,9,16,23వ తేదీల్లో హతియా–ఎర్నాకుళం (22837) ఏసీ ఎక్స్‌ప్రెస్, వచ్చే నెలలో 7,14,21,28వ తేదీల్లో హతియా–ఎస్ఎంవీ బెంగళూరు (18637) ఎక్స్‌ప్రెస్, వచ్చే నెలలో 3,8,10,15,17,22,24,29వ తేదీల్లో హతియా–ఎస్ఎంవీ బెంగళూరు (12835) ఎక్స్‌ప్రెస్ వచ్చే నెలలో 6,13,20,27 తేదీల్లో టాటానగర్–ఎస్ఎంవీ బెంగళూరు (12889) ఎక్స్‌ప్రెస్‌లు రెగ్యులర్ మార్గంలో కాకుండా నిడదవోలు, భీమవరం టౌన్, గుడివాడ, విజయవాడ మీదుగా నడుస్తాయి.

- ఈ నెల 8,12,13,15,16,17,20వ తేదీల్లో నిజాముద్దీన్–విశాఖపట్నం(12808) సమతా ఎక్స్‌ప్రెస్ మళ్లించబడిన మార్గంలో వయా నాగ్‌పూర్, విజయవాడ మీదుగా నడుస్తుంది.
- ఈ నెల 20న ఎల్టీటీ–విశాఖపట్నం(22848) ఎక్స్‌ప్రెస్ మళ్లించబడిన మార్గంలో వయా నాగ్‌పూర్, బల్లార్ష, విజయవాడ మీదుగా నడుస్తుంది.

ప్రాణాలు పోసే వైద్యులకే రక్షణ లేదా?



సముద్ర తీరంలో నిరసన తెలుపుతున్న వైద్యులు



రక్షణ కల్పించాలని నినాదాలు చేస్తున్న వైద్యులు

బీచ్‌రోడ్డులో జూనియర్ వైద్యుల నిరసన

మహారాణిపేట: కోల్‌కతాలో వైద్యురాలిపై అత్యాచారం, అనంతరం హత్య ఘటనను నిరసిస్తూ ఆదివారం బీచ్‌రోడ్డులో వందలాది మంది వైద్యులు, నర్సులు భారీ ర్యాలీ నిర్వహించారు. రాష్ట్ర జూనియర్ వైద్యుల సంఘం పిలుపు మేరకు నిర్వహించిన ర్యాలీలో పలు ఆస్పత్రుల వైద్యులు, నర్సులు నల్ల బ్యాడ్జీలు, టీషర్టులు ధరించి నిరసన తెలిపారు. బీచ్‌రోడ్డు కాళీమాత ఆలయం వద్ద మొదలైన ర్యాలీ వైఎంసీఏ వరకు చేరి, తిరిగి కాళీమాత ఆలయం వద్దకు చేరుకుని ముగిసింది. వైద్యులు నినాదాలు చేస్తూ, ప్లకార్డులు ప్రదర్శించారు. ఈ ఘటనలో నిందితులను కఠినంగా శిక్షించాలని, వైద్యులకు రక్షణ కల్పించాలని, చట్టాలను మార్పు చేయాలని డిమాండ్ చేశారు. విశాఖ హోమియో వైద్యుల సంఘం అధ్యక్షుడు డాక్టర్ పి.రాఘవేంద్రరావు, శ్రీకాంత్, చంద్రశేఖర్, శీటల్ తదితరులు పాల్గొన్నారు.

కొనసాగిన ఆందోళన

కోల్‌కతాలో వైద్యురాలిపై జరిగిన విషాద ఘటనకు నిరసనగా జూనియర్ వైద్యులు చేస్తున్న ఆందోళన కొనసాగింది. ఆరు రోజుల నుంచి వివిధ రూపాల్లో ఆందోళన చేస్తున్న జూనియర్ వైద్యు లు ఆదివారం ఆంధ్రా మెడికల్ కాలేజీ ఎదుట నిరసన తెలిపారు. కేజీహెచ్‌లో ఓపీలు, వార్డులకు హాజరుకాకుండా విధులు బహిష్కరించారు.

నేడు భారీ ర్యాలీ

ఈ సందర్భంగా జూనియర్ వైద్యుల సంఘం జిల్లా అధ్యక్షుడు డాక్టర్ టి.పృథ్వీరాజ్ మాట్లాడుతూ ఆందోళనలో భాగంగా సోమవారం కేజీహెచ్ నుంచి జీవీఎంసీ గాంధీ విగ్రహం వరకు భారీ ర్యాలీ నిర్వహిస్తామన్నారు. గాంధీ విగ్రహం వద్ద ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు దీక్షలో పాల్గొంటామని చెప్పారు. ఈ కార్యక్రమానికి ప్రభుత్వ, ఇతర వైద్య సంఘాలను ఆహ్వానించామన్నారు. ఈ కార్యక్రమంలో సంఘ ఉపాధ్యక్షుడు ఆర్.ఊహ, కార్యదర్శి వివేక్, ప్రధాన కార్యదర్శి డాక్టర్ సంయుక్త తదితరులు పాల్గొన్నారు.

శభాష్ పోలీస్

ఆత్మహత్యకు యత్నించిన వ్యక్తిని రక్షించిన పోలీసులు

అల్లిపురం: భార్యాభర్తల గొడవల నేపథ్యంలో ఆత్మహత్యకు యత్నించిన వ్యక్తిని వన్‌టౌన్ పోలీసులు రక్షించారు. తన భర్త నేపాకి ఉదయ్‌కుమార్ తాగివచ్చి ఇబ్బంది పెడుతున్నాడని కందులవారి వీధికి చెందిన వరలక్ష్మి వన్‌టౌన్ పోలీసు స్టేషన్‌లో ఆదివారం ఫిర్యాదు చేసింది. ఆమె వెనుక వచ్చిన ఉదయ్‌కుమార్.. తనతోపాటు ఇంటికి రమ్మని భార్యను పిలిచాడు. అయితే వరలక్ష్మి వెళ్లేందుకు ఇష్టపడ లేదు. దీంతో ఇంటికి వెళ్లిపోయిన ఉదయ్‌కుమార్.. ఇంట్లో సమస్యల కారణంగా తాను ఆత్మహత్య చేసుకుంటున్నానని సోదరి భవానికి ఫోన్ చేసి చెప్పాడు. కంగారుపడిన భవాని వెంటనే వన్‌టౌన్ పోలీసు స్టేషన్‌కు వెళ్లి జరిగిన విషయాన్ని చెప్పింది. అప్రమత్తమైన పోలీసులు వెంటనే బ్లూకోట్స్ కానిస్టేబుల్ జి.రామకృష్ణారెడ్డికి తెలియజేశారు. సంఘటనా స్థలానికి చేరుకున్న కానిస్టేబుల్ తలుపులు విరగ్గొట్టి అప్పటికే ఫ్యాన్‌కి ఉరివేసుకుంటున్న ఉదయ్‌కుమార్‌ను కాపాడి పోలీసు స్టేషన్‌కు తరలించారు. భార్యాభర్తలిద్దరికీ సీఐ బి.భాస్కరరావు కౌన్సెలింగ్ నిర్వహించి వారి కుటుంబ సభ్యులకు అప్పగించారు. సకాలంలో స్పందించిన పోలీసులను స్థానికులు అభినందించారు.



ఉదయ్‌కుమార్‌తో కానిస్టేబుల్ రామకృష్ణారెడ్డి

కైలాసగిరిపై సందడి





సెల్ఫీ ఆనందం

నగరంలోని పర్యాటక ప్రాంతాలు ఆదివారం సందడిగా మారాయి. ముఖ్యంగా కైలాసగిరి పర్యాటక ప్రాంతం పర్యాటకులతో కిటకిటలాడింది. ఇక్కడ సెల్ఫీ పాయింట్ అద్భుతమైన ఫొటోలు తీసుకోవడానికి అనువైన వేదికగా మారింది. పర్యాటకులు ఈ పాయింట్ వద్ద వివిధ కోణాల్లో ఫొటోలు తీసుకుంటూ సంబరపడ్డారు. కైలాసగిరి రోప్ వే, శివపార్వతి విగ్రహాలు, తదితర ప్రాంతాలు ఆకర్షణగా నిలిచాయి. నగరం నుంచి మాత్రమే కాకుండా.. ఇతర ప్రాంతాల నుంచి కూడా పెద్ద సంఖ్యలో పర్యాటకులు వచ్చారు. సాయంత్రం వాతావరణం కూడా అనుకూలంగా ఉండడంతో ప్రకృతి అందాలను ఆస్వాదించారు.

– ఫొటోలు: సాక్షి ఫొటోగ్రాఫర్, విశాఖపట్నం

సాగరతీరంలో హిందూ ఐక్యతా ర్యాలీ



ర్యాలీలో పాల్గొన్న హిందూ ధర్మ రక్షా సమితి సభ్యులు

బీచ్‌రోడ్డు: బంగ్లాదేశ్‌లో హిందువులు, హిందూ ఆలయాలపై జరుగుతున్న దాడులను నిరసిస్తూ.. సాగరతీరంలో ఆదివారం హిందూ ఐక్యతా ర్యాలీ జరిగింది. హిందూ ధర్మ రక్షా సమితి ఆధ్వర్యంలో ఆర్.కె.బీచ్ నుంచి వైఎంసీఏ వరకు సాగిన ర్యాలీలో పలువురు మాట్లాడారు. బంగ్లాదేశ్‌లోని హిందువుల కోసం భారత్‌లోని హిందువులందరూ ఒక తాటిపైకి రావాలన్నారు. పార్టీలు, కులాలకు సంబంధం లేకుండా తోటి హిందువులను కాపాడుకోవాలని పిలుపునిచ్చారు.

కనులపండువగా నృత్య పండగ



డ్యాన్స్ ప్రదర్శించిన చిన్నారులతో సినీనటి రాగిణి, నిర్వాహకురాలు విజయమాధవి

మద్దిలపాలెం: కళాభారతి ఆడిటోరియంలో విజయమాధవి సేవా సాంస్కృతిక అకాడమీ(హైదరాబాద్) ఆధ్వర్యంలో నిర్వహించిన డ్యాన్స్, మ్యూజిక్ ఫెస్టివల్ కనులపండువగా సాగింది. స్వాతంత్య్ర దినోత్సవం పురస్కరించుకుని ఆదివారం ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమం ఉదయం 9 గంటల నుంచి రాత్రి వరకు నిర్విరామంగా జరిగింది. రాయ్‌పూర్, కాకినాడ, రాజమండ్రి, అన్నవరం, శ్రీకాకుళం, విజయనగరం, విశాఖపట్నం నుంచి 250 మందికిపైగా చిన్నారులు పాల్గొని వివిధ పాటలకు అద్భుతంగా నాట్యం చేశారు. కార్యక్రమంలో పాల్గొన్న సినీ నటి రాగిణి మాట్లాడుతూ ఇంత గొప్ప కార్యక్రమంలో పాల్గొనడం సంతోషంగా ఉందన్నారు. నిర్వాహకులు విజయమాధవి మాట్లాడుతూ విశాఖ కళలకు పుట్టినిల్లు వంటిదని.. ఇక్కడ విజయవంతంగా కార్యక్రమం నిర్వహించడం ఆనందంగా ఉందన్నారు. స్నేహాంజలి ఆర్ట్స్ చిన్నారుల ప్రదర్శనలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. సినీ నటులు సుమనశ్రీ, వంశీకృష్ణ శ్రీనివాస్ తదితరులతో కలిసి అతిథులు చిన్నారులకు ప్రశంసాపత్రాలతో పాటు జ్ఞాపికలు బహూకరించారు.

మైనింగ్‌తో మానవ మనుగడకు ముప్పు

మానవ హక్కుల వేదిక ప్రతినిధులు

తగరపువలస: మానవ మనుగడకు హాని కలిగించే మైనింగ్ అనుమతులు రద్దు చేయాలని మానవ హక్కుల వేదిక ప్రతినిధులు సూచించారు. ఆనందపురం మండలం కుసులవాడలో మానవహక్కుల వేదిక ఉమ్మడి జిల్లాల సమన్వయకర్త వి.ఎస్.కృష్ణ ఆధ్వర్యంలో జిల్లా అధ్యక్షుడు పి.రఘు, ప్రధాన కార్యదర్శి కె.అనురాధ ఆదివారం పర్యటించారు. పంచాయతీలోని గొల్లలపాలెం, చిన్నయ్యపాలెం, రాముణేనిపేట, రేగానిగూడెం, బాకూరుపాలెం మైనింగ్ క్వారీలను సందర్శించారు. వారు మాట్లాడుతూ మైనింగ్ అనుమతుల కోసం ఈ నెల 28న జరగనున్న ప్రజాభిప్రాయ సేకరణ విషయం తమ దృష్టికి వచ్చిందన్నారు. మైనింగ్ పేరుతో కొండలను ధ్వంసం చేయడం వలన మానవ ఆరోగ్యంతో పాటు పర్యావరణానికి హానికరమన్నారు. సర్వే నంబర్ 104లో మైనింగ్ అనుమతులు కోరుతూ జరగనున్న ప్రజాభిప్రాయ సేకరణను అంతా వ్యతిరేకించాలని సూచించారు. స్థానికులతో మాట్లాడగా కొండలను ధ్వంసం చేయడం వలన ధ్వని, పర్యావరణ కాలుష్యంతో పాటు ఇళ్లకు ముప్పు పొంచి ఉంటుందన్నారు. పశు సంపద కూడా దెబ్బతింటుందని తెలిపారు.



కుసులవాడలో స్థానికులతో మాట్లాడుతున్న మానవహక్కుల వేదిక ప్రతినిధులు

సాక్షి క్లాసిఫైడ్స్

CHANGE OF NAME
I, AMAR NATH M, Age 22 years, (Date of birth 07 Mar 2002) S/o. JC-845394X Nb Sub B. Murugeswaran, presently Resident of Qtr No. R-27, Nausena Baugh, Malkapuram Post, Visakhapatnam-530005. I have changed my name from AMARNATH to AMAR NATH M, vide Affidavit dated 8th August, 2024 before Notary, Visakhapatnam.

Education

EDUCATION
■ Study from home. Online Degree, PG Diploma, B.Tech, BBA, MBA, MCA etc. Courses admissions going on. Guarantee pass. Eligible for all jobs. Ph: 79972 96796 [V- 120119]

Wanted

■ బైక్ రైడ్స్‌తో సంపాదన హ్యా..! రూ. 2000/- day. మన విశాఖ మరియు పరిసర ప్రాంతాలలో, బెనిఫిట్స్: P/F జాబ్, 0% కమీషన్, 25% కొత్త రేట్ కార్డు, డైలీ/వీక్లీ ఇన్సెంటివ్స్, 5 లక్షల వరకు ఇన్సూరెన్స్. ఫోన్: 73962 67109 / 040-48937612. [V- 12507]

■ Wanted Male Administrative Officers Qualification Any Degree, Age Limit: 25 to 45 years. Salary upto: 15000/- to 20000/-. Location: Gajuwaka. Contact: 80085 56073, 80085 57071. [G-5628]

■ ప్రముఖ సంస్థలో పని చేయుటకు Male సెక్యూరిటీ గార్డ్స్ కావలెను. మంచి జీతం + PF + ESI, ప్రదేశం: Vizag. సంప్ర: ✆ 87126 36579 [B-381]

■ త్రివేణి హోంకేర్ హైదరాబాద్ నందు వృద్ధులను, పేషెంట్స్‌ను చూసుకొనుటకు వర్కర్స్ / నర్సులు కావలెను. ఫ్రీ వసతి+భోజనం. జీతం: 18K, ఫోన్ : 9160900024, 9640400073 [H-796267]

■ ప్రముఖ ఎయిర్‌పోర్ట్‌లో పనిచేయటానికి కార్గో సూపర్‌వైజర్, కంప్యూటర్ ఆపరేటర్స్, సెక్యూరిటీ సూపర్‌వైజర్స్, క్యాబ్ డ్రైవర్స్ అర్జెంటుగా కావలెను. జీతం : 28000 నుంచి 34000 రూము+ భోజనం ఫ్రీ. Ph: 7093769794 [H-778942]

Real Estate

FLAT FOR SALE
■ Luxury 3 Bed Room Flats for sale, Yendada Main Road South 1510 Sq.ft. 2 Road corner. Rate 78 Lakhs including amenities. Ph : 79893 44212 [V- 12501]

PLOT FOR SALE
■ VJA, మంగళగిరి, బెంజిసర్కిల్‌కి 5 కి.మీ. బందరు రోడ్డు, గన్నవరం, నున్న, కంచికచర్ల శ్రీగంధం, ఎర్రచందనం మొక్కలతో చ॥గ॥ 1,900/- నుండి 18,500/- ఇళ్ళ ప్లాట్స్, ఫామ్‌హౌస్ ప్లాట్ సెంట్ 1,90,000/- సంప్ర: ✆ 7731076666 [B-54]

Services

GOLD LOANS
■ లోకేష్ గోల్డ్ లోన్స్ :- బ్యాంక్/ప్రైవేట్ తాకట్టులో ఉన్న బంగారాన్ని విడిపించి అదే రోజు మార్కెట్ రేటుకు కొనబడును. సంప్ర :- 98484 88068/ 77992 23300 [V- 12484]

రియల్టీ సమాచారం కొరకు లాగాన్ కండి www.sakshi.com

గమనిక
సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

సాక్షి క్లాసిఫైడ్స్ లలితానగర్, అక్కయ్యపాలెం, విశాఖపట్నం - 16.

మురళీనగర్, మాధవధార	: 90101 33346
NAD, కంచరపాలెం	: 90108 10033
గోపాలపట్నం, పెందుర్తి	: 70759 89701
సీతమ్మధార, ద్వారకానగర్	: 90100 55116
డాబాగార్డెన్స్, జగదాంబ MVP కోలనీ, మద్దిలపాలెం	: 90101 96663
గాజువాక	: 97059 33394

విశాఖపట్నం, అనకాపల్లి + అల్లూరి జిల్లా
నాలుగు లైన్లు రూ.475/-
అదనపు లైను రూ.100/-
+ 5% జి.ఎస్.టి. అదనం